లమతాపుట్‌లో షూటింగ్ సందడి

మాచ్‌ఖండ్, న్యూస్‌టుడే: లమతాపుట్ సమితి కేంద్రంలోని ఆశాకిరణ్ ఆసుపత్రి వద్ద శుక్రవారం సినిమా చిత్రీకరణ జరిగింది. ప్రముఖ దర్శకుడు జాగర్ల మూడి రాధకృష్ణ (క్రిష్) దర్శకత్వంలో అనుష్కశెట్టి నటిస్తున్న చిత్రానికి సంబంధించి పలు సన్నివేశాలను ఆసుపత్రి సమీపంలో తీశారు. ప్రముఖ నటుడు జగపతిబాబు పాల్గొన్నారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. చిత్రీకరణకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా నందపూర్ ఎస్డీపీవో సంబిత్‌కుమార్ మాఝి బందోబస్తు ఏర్పాటు చేశారు.

భువనేశ్వర్ విమానాశ్రయానికి రెండో టెర్మినల్

రెండేళ్లలో పనులు పూర్తవుతాయన్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



భువనేశ్వర్ విమానాశ్రయం


కె.రామ్మోహన్‌నాయుడు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రెండో టెర్మినల్ నిర్మాణం కానుంది. దీనిపై కేంద్రం నిర్ణయం తీసుకున్నట్లు విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు శుక్రవారం దిల్లీలో విలేకర్లకు చెప్పారు. దీనిపై సమీక్ష జరిగిందన్నారు. భువనేశ్వర్ విమానాశ్రయం నుంచి ఏడాదిలో 40 లక్షల ప్రయాణికులు రాకపోకలు చేస్తున్నారని, దీని సామర్థ్యం రెట్టింపు చేసేందుకు సన్నాహాలు ప్రారంభిస్తున్నామన్నారు. రెండేళ్ల వ్యవధిలో పనులు పూర్తి చేయాలని ధ్యేయంగా పెట్టుకున్నామన్నారు. సమీప భవిష్యత్‌లో భువనేశ్వర్ నుంచి కోటి మంది(ఏడాదిలో) రాకపోకలు చేస్తారన్న అంచనాతో రెండో టెర్మినల్ నిర్మిస్తున్నట్లు చెప్పారు.

పుడమితల్లి సంరక్షణ అందరి బాధ్యత


మాజీ సీఎం నవీన్ పట్నాయక్


పర్యావరణ పరిరక్షణకు ఉద్యమిస్తున్న సంస్థ ప్రతినిధికి జ్ఞాపికలు అందజేస్తున్న నవీన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పుడమి తల్లి సంరక్షణ అందరి బాధ్యతని మాజీ ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ అన్నారు. సంబాద్ గ్రూపు సంస్థల ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లో పునశ్చపృథ్వీ(ఎర్త్ ఎగైన్) మూడు రోజుల సదస్సులో భాగంగా గురువారం రాత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. లోగడ పర్యావరణానికి సంబంధించి పుస్తకాలు రచించిన తనకు ఇటీవల కాలంలో జరిగిన పరిణామాలు ఆందోళన కలిగించాయన్నారు. భూతాపం విపత్తులకు దారితీస్తుందని, ప్రతిఒక్కరు అప్రమత్తం కావాలన్నారు. ఈ అంశంపై అవగాహన కలిగిస్తున్న సంబాద్ యాజమాన్యం కృషి ప్రశంసనీయమని, ఇతర సంస్థలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పర్యావరణ హితం కోరి పనులు చేసిన కొంతమంది ప్రముఖుల్ని నవీన్ సత్కరించారు. కార్యక్రమంలో సంబాద్ గ్రూపుసంస్థల అధ్యక్షుడు సౌమ్య రంజన్‌పట్నాయక్, ప్రధాన సంపాదకురాలు తనయ పట్నాయక్, ఇతర పర్యావరణవేత్తలు పాల్గొన్నారు.

కార్పొరేషన్ పదవులపైనే ఆశలన్నీ

జాబిత పరిశీలనలో ఉందన్న మన్మోహన్ సామల్



భువనేశ్వర్, న్యూస్‌టుడే

సార్వత్రిక ఎన్నికల వేళ ఇతర పార్టీల నుంచి పలువురు నాయకులు భాజపా తీర్థం పుచ్చుకున్నారు. మరి కొంతమంది తొలి నుంచి పార్టీనే నమ్ముకుని ఉన్నారు. ప్రజలు భాజపా వైపు మొగ్గు చూపడంతో కమలం విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇప్పుడు ఆ నాయకులందరికి పదవులిచ్చి సంతృప్తి పరచాలి. దాంతో వారంతా పైరవీలు ప్రారంభించారు.

ఆరు నెలలుగా ఖాళీ

ప్రస్తుతం 37 కార్పొరేషన్లకు అధ్యక్షులను నియమించడంతోపాటు 23 అభివృద్ధి మండళ్ల (ఎస్‌డీసీ), సహకార బ్యాంకులు, రాష్ట్ర, జిల్లా స్థాయిలోని ప్రణాళికా బోర్డులు పదవులు భర్తీ చేయాల్సి ఉంది. లోకాయుక్త వంటి కీలకమైన పదవి ఆరునెలలుగా ఖాళీగా ఉంది. దివంగత జె.బి. పట్నాయక్ సీఎంగా ఉన్న సమయంలో వీటి బాధ్యతలు అధికారులే పర్యవేక్షించేవారు. బిజుపట్నాయక్, నవీన్‌ల హయాంలో నాయకులను నియమించేవారు. భాజపా ప్రస్తుతం దానినే అనుసరిస్తోంది.

వీరే కీలకం...

భాజపా రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు సమీర్ మహంతి, ప్రస్తుత ఉపాధ్యక్షుడు గోలక్ మహాపాత్ర, బిరించి త్రిపాఠి, జతిన్ మహంతి, సజ్జన్ శర్మ, అధికార ప్రతినిధి అనిల్ బిశ్వాల్, ఎన్నికల్లో పరాజయం చవిచూసిన కుసుంటెటె, ప్రదీప్తనాయక్, బిజద వీడి వచ్చిన మాజీ మంత్రి సమీర్ రంజన్ దాస్‌లకు కీలక పదవులు వరించనున్నాయి.

అప్పుడే నియామకాలు

భాజపా రాష్ట్రశాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ మంగళవారం రాత్రి భువనేశ్వర్‌లో విలేకరులతో మాట్లాడుతూ... ప్రస్తుతం పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం జరుగుతోంది. ఇది పూర్తయిన తరువాత విధేయత, అనుభవం, దక్షత కలిగిన వారిని నియమిస్తామన్నారు.

శ్రీక్షేత్రంలో గోప్యగుండిచా వేడుకలు


పూరీ నారాయణి ఆలయంలో దుర్గాదేవి రూపంలో మహాలక్ష్మి

గోపాలపూర్, న్యూస్‌టుడే: వైష్ణవ, శైవ, శాక్తేయ శక్తులకు నిలయమైన విశ్వప్రసిద్ధ పూరీ శ్రీక్షేత్రంలో గురువారం రాత్రి నుంచి గోప్య గుండిచా వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆశ్వయుజ పాడ్యమి నుంచి మహార్నవమి వరకు(9రోజులు) దుర్గా మాధవ సేవలు, పూజలు చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. రథయాత్రలో మహాలక్ష్మిని వెంట తీసికెళ్లని జగన్నాథుడు దేవీ నవరాత్రుల్లో దుర్గమ్మను డోళమండపం వీధిలోని నారాయణి ఆలయానికి తీసుకెళతారు. దసరా సంబరాల్లో 9 రోజుల పాటు గోప్యంగా ఈ ఘట్టం జరుగుతుంది. దుర్గారూపంలో ఉన్న లక్ష్మి వద్దకు పురుషోత్తముడు పల్లకిలో నిత్యం రాత్రుళ్లు నారాయణి మందిరానికి వెళతాడు. ఈ వేడుక సేవాయత్‌లు ప్రారంభించారు. 11వ తేదీ(నవమి)రాత్రి వరకు ఇది కొనసాగుతుంది. మరోవైపు శ్రీక్షేత్రంలోని విమల మందిరంలో తల్లికి షోడశోపచార సేవలు జరుగుతున్నాయి. దేవీ నవరాత్రుల నేపథ్యంలో ఈ వేడుకలు తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో పూరీ వస్తున్నారు. నాలుగు ద్వారాల మీదుగా రాకపోకలకు యంత్రాంగం వెసులుబాటు కల్పిస్తోంది.

లక్ష్మిమాఝి హత్యకేసులో కలెక్టర్, ఎస్పీలకు శ్రీముఖాలు

అక్టోబరు 17లోగా హాజరుకావాలని ఎన్‌సీఎస్‌టీ నోటీసులు


లక్ష్మిమాఝి(పాతచిత్రం)

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లాలో సంచలనం సృష్టించిన లక్ష్మిమాఝి(24) అనే ఆదివాసీ యువతి హత్యకేసులో కలెక్టర్, ఎస్పీలకు జాతీయ ఎస్టీ కమిషన్(ఎన్‌సీఎస్‌టీ) శ్రీముఖాలు గురువారం జారీ అయ్యాయి. ఈ నోటీసులో అక్టోబరు 17లోగా కమిషన్ ఎదుట హాజరు కావాలని దిశానిర్దేశం చేసింది. ఈ వివరాలను భాజపా ఎస్టీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి కాళీరాం మాఝి మీడియాకు ప్రకటన ద్వారా వెల్లడించారు. గతంలో కమిషన్ ఉపాధ్యక్షుడిగా ఉన్న అనంత్‌నాయక్‌కు కేసుకు సంబంధించి వినతిపత్రాన్ని అందజేయగా కమిషన్ చర్యలు తీసుకుందని కాళీరాం అందులో పేర్కొన్నారు. బిజద ప్రభుత్వ హయాంలో ఓ ఆదివాసీ యువతిని దారుణంగా హత్యచేసిన ఘటనపై బాధిత కుటుంబానికి అప్పటి నవీన్ సర్కార్ ఏ మాత్రం న్యాయం చేయలేదని మాఝి దుయ్యబట్టారు. సీహెచ్‌సీ సమీపంలో సగం కాలిన యువతి మృతదేహం లభ్యమై జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేగింది. దీనిపై అప్పట్లో భాజపాతో పాటు పలు రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు తీవ్ర ఆందోళనలు, రాస్తారోకోలు చేసినప్పటికీ బిజద సర్కార్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని మాఝి గుర్తు చేశారు. ఎట్టకేలకు ఎన్‌సీఎస్‌టీ దీనిపై స్పందించి గురువారం జిల్లా పాలనాధికారి, ఎస్టీ పేరిట నోటీసులివ్వడం హర్షనీయమన్నారు.


అనంతనాయక్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కాళీరాం

అసలేం జరిగింది?

రాయగడ జిల్లా కాశీపూర్ సమితి టికిరి పోలీసుస్టేషన్ పరిధి నకటిగూడ గ్రామానికి చెందిన బెలధర్ మాఝి కుమార్తె లక్ష్మిమాఝి(24) దివ్యాంగురాలు. ఆమె చంద్రపూర్‌లోని మా గృహలో వార్డెన్‌గా విధులు నిర్వహిస్తుండేవారు. చంద్రపూర్ సీహెచ్‌సీ సమీపంలో 2023 డిసెంబరు 21న సగం కాలిన లక్ష్మి మృతదేహాన్ని గుర్తించారు. లక్ష్మీని అత్యాచారం చేసి హత్యచేశారని ఆరోపిస్తూ ఆమె కుటుంబీకులు అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పటి వరకు నిందితులను అరెస్టు చేయలేదు. ఈ ఘటనపై అప్పటి ప్రతిపక్షాలైన భాజపా, కాంగ్రెస్ పార్టీలు కదం తొక్కాయి. జిల్లా ఆదివాసీ మహాసంఘం 12 గంటల పాటు రాయగడ బంద్ నిర్వహించిన విషయం తెలిసిందే. కేంద్ర ఫోరెన్సిక్ శాస్త్రీయ ప్రయోగశాల నుంచి ముగ్గురు సభ్యులతో కూడిన బృందం ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించిన విషయం తెలిసిందే. దీంతో పాటు క్రైం బ్రాంచ్ విచారణ మొదలెట్టినా ఎలాంటి ఫలితం కానరాలేదు. లక్ష్మీ మృతి ఓ మిస్టరీగా మారడాన్ని ఇప్పటికీ ఆదివాసీ ప్రజలు, సానుభూతిపరులు జీర్ణించుకోలేకపోతుండటం గమనార్హం.

సేంద్రియ ఎరువులు ఉత్తమం



మాట్లాడుతున్న సింగ్‌దేవ్


భువనేశ్వర్, న్యూస్‌టుడే: అన్నదాతలు సేంద్రియ ఎరువులు వినియోగిస్తే నాణ్యత కలిగిన దిగుబడి అందుతుందని ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ చెప్పారు. భువనేశ్వర్‌లో రెండురోజుల వ్యవసాయ సదస్సును గురువారం ప్రారంభించారు. సింగ్‌దేవ్ మాట్లాడుతూ రసాయన ఎరువులు హానికరమన్నారు. అధికోత్పత్తులు కోసం రైతులు ఎక్కువగా రసాయన ఎరువులు వాడుతున్నారని, మానుకోవాలని హితవు పలికారు. కేవలం వరి సాగుకు మాత్రమే పరిమితం కాకుండా, లాభసాటి ఇతర పంటలూ వేయాలన్నారు. ఈ దిశగా వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి అరవిందపాఢి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ ఉపకరణాల తయారీ కంపెనీల ప్రతినిధులు తమ ఉత్పత్తులు వినియోగానికి సంబంధించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

వీల్‌చైర్ రగ్బీలో ఒడిశా గెలుపు


పతకాలతో క్రీడాకారులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: గ్వాలియర్‌లోని అటల్ బిహారి వాజ్‌పేయి కేంద్రంలో జరిగిన ఆరో జాతీయ వీల్‌ఛైర్ పురుషుల రగ్బీ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు విజేతగా నిలిచి పసిడిపతకం సాధించారు. ఈ మేరకు రాష్ట్ర క్రీడావిభాగం 'ఎక్స్'లో ఆ వివరాలు వెల్లడించింది. పోటీల్లో తుదిపోరులో ఒడిశా జట్టు క్రీడాకారులు 28-09 పాయింట్లతో కేరళ జట్టు క్రీడాకారులపై గెలుపొందారు. గురువారం రాష్ట్రానికి చేరుకున్న జట్టు క్రీడాకారులకు భువనేశ్వర్ విమానాశ్రయంలో క్రీడావిభాగం అధికారులు పుష్పగుచ్ఛాలందజేసి అభినందనలు తెలిపారు. ఈ పోటీల్లో తొలిసారి రాష్ట్ర జట్టు పసిడిపతకం దక్కించుకోవడంపట్ల గర్వంగా ఉందని ఒడిశా పారా క్రీడల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కమలకాంత్ రథ్, లోక్‌నాథ్ మహంతిలు హర్షంవ్యక్తంచేశారు.


పర్లాఖెముండిలో...


జయపురంలో..


గుణుపురంలో బతుకమ్మతో మహిళలు

పరమేశ్వరీ.. శరణు.. శరణు..!

దుర్గా శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మండపాలు ఆకట్టుకుంటున్నాయి. రోజుకో రూపంలో భక్తులను దుర్గామాత దర్శించనున్నారు. ఇప్పటికే మహిళలు తల్లి సమక్షంలో పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఏ పల్లె, పట్టణం చూసినా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గుణుపురంలో తెలంగాణ పండగ అయిన బతుకమ్మ పూజలు నిర్వహించడం ఆకట్టుకుంది.

–పర్లాఖెముండి, జయపురం, గుణుపురం, బ్రహ్మపుర


బ్రహ్మపుర నగరం: మహిళల సామూహిక కుంకుమార్చనలు

ఆమె పాటకు ప్రకృతే గురువు


గీతం ఆలపిస్తూ..

గాయనిగా రాణిస్తున్న ఆదివాసీ యువతి

సిమిలిగుడ, న్యూస్‌టుడే

కొరాపుట్ జిల్లాలోని ఆదివాసీ సంస్కృతి, సాహిత్యంతోపాటు వినసొంపైన గాత్రంతో కనక్ కిలో గుర్తింపు పొందుతోంది. యూట్యూబ్‌లో ఆమె పాడిన పాటలు చక్కర్లు కొడుతున్నాయి. కొరాపుట్ జిల్లాలోని సునాబెడ సమీపంలోని మోహనపడ గ్రామానికి చెందిన కనక్ కిలో నిరుపేద రైతు కుటుంబంలో పుట్టింది. ఆదివాసీ యువతి కావడంతో చిన్న వయసులోనే వివాహమైంది. చిన్నానాటి నుంచి ప్రకృతి ఒడిలో పెరిగిన ఆమె సంగీతం, నాట్యం, కవిత్వంపై మక్కువ పెంచుకుంది. తనకు తెలిసినట్లు పాడేది, ఆడేది, రాసేది ఓ విధంగా ప్రకృతే ఆమెకు గురువుగా మారింది. పెళ్లి చదువుకు అడ్డంకిగా మారడంతో అత్తగారింట్లో ఉంటూ ఇంటి పనుల్లో బిజీగా మారింది. చదువుపై ఆమెకు ఉన్న ఆసక్తిని గమనించిన భర్త సిమిలిగుడ ప్రభుత్వ కళాశాలలో చేర్పించారు.

యూట్యూబ్‌లో గుర్తింపు

తన అభిరుచికి, చదువు తోడవటంతో కళాశాలలో నిర్వహించే సంగీతం, పద్యాలు, నృత్యం క్రీడలు వంటి పోటీల్లో పాల్గొని సత్తా చాటేది. కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలకు స్వయంగా పాటలు రాసి అభినందనలు పొందేది. కొంతమంది స్థానిక సంగీత దర్శకులు తన గురించి తెలుసుకుని పాటలు పాడించుకున్నారు. అనంతరం వాటిని యూట్యూబ్‌లో ఉంచడంతో వీక్షకులు సంఖ్య పెరిగింది.


కనక్ రాసిన దేశ భక్తి గీతాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం మోహన్ మాఝి

ముఖ్యమంత్రి అభినందన

కార్గిల్ దివస్ సందర్భంగా అమరులైన వీరుల పోరాటాన్ని స్మరించుకుని రాసిన పాట వైరల్ అయింది. ఆ గీతాన్ని సీఎం మోహన్ మాఝి ఆవిష్కరించారు. పాట విన్న ఆయన కనక్ ప్రతిభను ప్రశంసించారు. మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సైతం అభినందించారు. ఆదివాసీ యువతి అయినప్పటికీ తన నైపుణ్యంతో రాణిస్తున్న ఆమెను జిల్లా యంత్రాంగం సత్కరించింది. ఆదివాసీ కొలనులో పుట్టిన బంగారు పుష్పం మా కనక్ కిలో అని కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్థులు మురిసిపోతున్నారు. ఎప్పటికైనా మంచి గాయనిగా గుర్తింపు తెచ్చుకోవడమే తన జీవితాశయమని ఈ సందర్భంగా ఆమె పేర్కొంది.

సముదాయం నిర్మాణం కలేనా


గిరిమార్కెట్ స్థలం

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: నగరం నడిబొడ్డున ఉన్న గిరిమార్కెట్‌లో బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) నిర్మాణం చేపట్టనున్న కాంప్లెక్స్ పనులకు ఇంకా మోక్షం లభించలేదు. మూడేళ్ల కిందట దీనికోసం పాత భవనాన్ని కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఆ స్థలంలో కొత్త భవనం నిర్మించి 2024నాటికి పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నా.. పనులు ముందుకుసాగలేదు. భవనాన్ని కూల్చి వేసిన తరువాత రెండు విడతల్లో నిర్మాణ పనులు జరిపించేందుకు నిర్ణయించిన బీఈఎంసీ ఇందుకోసం రూ. 49.15 కోట్ల వ్యయ అంచనాతో మూడంతస్తుల భవనం, కింద కార్లు, ద్విచక్రవాహనాలు పార్కింగు చేసేందుకు స్థలం, ఇతర సౌకర్యాలతో ఓ డీపీఆర్‌ను రూపొందించింది. పనులు పురోగతిపై చర్చలు కూడా జరిగాయి. మూడేళ్లలో కొత్త భవనాన్ని నిర్మిస్తామని చెప్పిన బీఈఎంసీ ఇప్పటివరకు ఆ ఊసేలేదు. దీనిపై ఆ వ్యాపారులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భవనాన్ని కూల్చేసి వారికి ఆశ్రయంలేకుండా చేశారని వాపోతున్నారు. దీనిపై బీఈఎంసీ మేయరు సంఘమిత్ర దొళాయిను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా నిర్మాణ పనుల కోసం అప్పట్లో డీపీఆర్, ఇతర పనులు పూర్తయినప్పటికీ నిర్మాణ పనులు చేపట్టేందుకు ఎవరు ముందుకు రాలేదని చెప్పారు. మండలి సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కొత్త ప్రభుత్వం రావడంతో మళ్లీ కొత్త డీపీఆర్, ఇతర ప్రక్రియలు జరగాల్సి ఉందన్నారు.

స్తంభించిన జనజీవనం

అవిభక్త కొరాపుట్ జిల్లాలోని (మల్కాన్‌గిరి, నవరంగ్‌పూర్, కొరాపుట్, రాయగడ) జిల్లాలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు జిల్లా వాసులకే ఇవ్వాలన్న డిమాండ్‌తో రాయగడ జిల్లా గిరిజన, దళిత మంచ్ బంద్‌కు పిలుపునిచ్చింది. దీంతో గుణుపురం, సిమిలిగుడ, మాచ్‌ఖండ్, జయపురం, మల్కాన్‌గిరి ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. వాహనాలు నిలిచిపోయాయి. సంఘం ప్రతినిధులు రోడ్లపైకి చేరుకుని నినాదాలు తెలుపుతూ నిరసన తెలిపారు.

–న్యూస్‌టుడే, మాచ్‌ఖండ్, గుణుపురం, సిమిలిగుడ మల్కాన్‌గిరి, జయపురం


సిమిలిగుడ: చాటువాలో రోడ్డుపై టైర్లు కాల్చుతున్న దృశ్యం


గుణుపురం: బలరామ్‌నగర్ కూడలిలో..

కారాగారంలో ఆకస్మిక తనిఖీలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సంబల్‌పూర్ మండల కారాగారంపై శుక్రవారం తెల్లవారు జామున 4 గంటలకు పోలీసులు మెరుపుదాడి చేశారు. ఉదయం 7 వరకు 22 గదుల్లో జరిగిన తనిఖీల్లో గంజాయి, సిగరెట్లు, బీడీకట్టలు, గుట్కా స్వాధీనం చేసుకున్నారు. మేజిస్ట్రేట్ స్వాధీన్ బెహరా పర్యవేక్షణలో సంబల్‌పూర్ అదనపు ఎస్పీ హరీష్‌చంద్రపాండే, ఇతర సిబ్బంది సోదాల్లో పాల్గొన్నారు. అనంతరం హరీష్ విలేకర్లతో మాట్లాడుతూ జైలుకి మత్తు పదార్థాలు ఎలా చేరుతున్నాయో దర్యాప్తు చేస్తామన్నారు.

'సంబాద్'కు గవర్నరు అభినందన

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పర్యావరణ హితం కోరి సంబాద్ గ్రూపు సంస్థల యాజమాన్యం 'పునశ్చపృథ్వీ' సదస్సు చేపట్టడం అభినందనీయమని గవర్నరు రఘుబర్‌దాస్ అన్నారు. శుక్రవారం జరిగిన ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. సంబాద్ సంస్థ అధ్యక్షుడు సౌమ్య రంజన్ పట్నాయక్, ప్రధాన సంపాదకురాలు తనయ పట్నాయక్ జ్ఞాపికలు అందజేశారు.



ఖరగపూర్‌లో పూజలందుకుంటూ..

పరాశక్తి పాహిమాం

శరన్నవరాత్రుల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. మండపాల వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. హోమాలతో పాటు సామూహిక కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని భక్తులు దర్శించుకుని తరించారు.

– న్యూస్‌టుడే, బృందం




కొరాపుట్ శబరి శ్రీక్షేత్రం..



రాయగడ కస్తూరినగర్‌లో.. అమ్మవారి అలంకరణ



బ్రహ్మపురలో..



గోపాలపూర్‌లో..

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: స్థానిక బి.ఎన్.పూర్ ఠాణా పరిధిలోని టాటా బెంజి కూడలి సమీపంలో ఓ బంగారం దుకాణంలో ఈ ఏడాది సెప్టెంబరు 4న చోరీ జరిగింది. ఈ కేసులో పోలీసులు తొమ్మిది మంది అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేశారు. గంజాం జిల్లా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాలకు చెందినవారిని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. శుక్రవారం చెప్పారు. మధ్యాహ్నం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిందితుల నుంచి రూ.1.57 లక్షల నగదు, పది కిలోల వెండి, ఇళ్ల చోరీకి వినియోగించే గ్యాస్ కట్టర్, గ్యాస్ సిలిండర్, ఆయుధ పరికరాలు, ఓ స్కూటీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పాత్రికేయులు వాస్తవాలు రాయాలి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పాత్రికేయులు వాస్తవాలు రాయాలని యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ అన్నారు. హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీలో ఒడిశాకు చెందిన 30 మంది పాత్రికేయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెన్నీఫర్ విలేకరులకు విలువైన సూచనలు ఇచ్చారు.

ఏనుగు దాడిలో ఒకరి దుర్మరణం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సుందర్‌గఢ్ జిల్లా కొయిడా అటవీ రేంజ్ పరిధిలోని పటముండా గ్రామంలో శుక్రవారం తెల్లవారు జాము ఒక గజరాజు విధ్వంసం సృష్టించి, ఆదివాసీ వ్యక్తిని చంపేసింది. కొయిడా పరిధిలోని ఈ ఘటన జరగడంతో గ్రామస్థులు భయాందోళనకు లోనయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

వైద్యుడిపై దాడి.. ఠాణా ముట్టడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కళ్లికోట ఠాణా పరిధిలోని మథుర గ్రామంలో గురువారం నిమయి బిశ్వాస్ అనే బెంగాలీ వైద్యుడిపై కొందరు యువకులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతడికి కళ్లికోట ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స అనంతరం ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో ఆగ్రహించిన మథుర గ్రామస్థులు తక్షణం నిందితుల్ని అరెస్టు చేయాలని డిమాండు చేస్తూ కళ్లికోట ఠాణాను ముట్టడించారు. వారికి నచ్చజెప్పిన పోలీసులు దాడికి పాల్పడిన ముగ్గురు యువకుల్ని సాయంత్రం అరెస్టు చేశారు.

● బ్రహ్మపుర శివారున హల్దియాపదర్ పైవంతెన వద్ద శుక్రవారం ఓ కంటెయినర్‌ను గ్యాసు ట్యాంకరు ఢీకొంది. ఈ ప్రమాదంలో గ్యాసు ట్యాంకరు ముందు భాగం దెబ్బతినగా, చోదకుడికి గాయాలయ్యాయి. అతడిని చికిత్సకు ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

టేకు దుంగలు స్వాధీనం

గుణుపురం, న్యూస్‌టుడే: అక్రమంగా రవాణా చేస్తున్న కలపను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఉదయం విలేకరులకు సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. గుడారి సమితిలో అక్రమంగా కలప రవాణా చేస్తున్నట్లు అటవీ అధికారులకు సమాచారం అందింది. దీంతో యంత్రాంగం కరాసింగి కూడలి వద్ద తనిఖీలు నిర్వహించారు. అటుగా వస్తున్న మ్యాక్స్‌పికప్ వ్యానును ఆపి పరిశీలించగా 25 టేకు దుంగలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితులని అదుపులో తీసుకున్నట్లు రేంజరు దిలీప్ కుమార్ పట్నాయక్ తెలిపారు. దీని విలువ రూ. లక్ష ఉంటుందని చెప్పారు.

కానిస్టేబుళ్లకు గాయాలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సంబల్‌పూర్ జిల్లా బుర్లా ఠాణా పరిధిలోని ఝురాపల్లి గ్రామానికి ఓ కేసు విచారణకు వెళ్లిన పోలీసులపై నిందితుడు దాడి చేశారు. ఈ ఘటనలో సరోజ్‌బాయ్ అనే కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని బుర్లా ఆసుపత్రిలో చికిత్సకు తరలించి నిందితుడిని అరెస్టు చేశారు. ● గురువారం అర్ధరాత్రి భువనేశ్వర్ మంచేశ్వర్ ఠాణా పరిధిలోని శ్రీరాంనగర్ ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు కొట్లాట గమనించారు. ఆపేందుకు ప్రయత్నించిన కానిస్టేబుల్‌ను యువకుడు కత్తితో దాడిచేశాడు. క్షతగాత్రుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

అస్వస్థతకు గురై వ్యక్తి మృతి

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణంలో ఓ వ్యక్తి అస్వస్థతకు గురై మృతి చెందాడు. మృతుడు కంగా పంచాయతీ సొలపియాగూడ గ్రామానికి చెందిన రాయిలు అమానత్య(52)గా పోలీసులు గుర్తించారు. శవపరీక్ష నివేదిక అనంతరం మృతికి గల కారణాలు వెల్లడిస్తామని ఐఐసీ ఈశ్వర్‌తాండి తెలిపారు.

చెట్టు పడి రాకపోకలకు అంతరాయం

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా కలిమెల సమితి బెజంగివాడ నుంచి కలిమెల వెళ్లే రహదారిపై చెట్టు పడి రాకపోకలకు అంతరాయం కలిగింది. శుక్రవారం ఉదయం కలిమెల సమితిలో కురిసిన వర్షానికి ఈ ఘటన చోటు చేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది చెట్టుని తొలగించారు.

అర్పణ బియ్యం విక్రయం



గోపాలపూర్, న్యూస్‌టుడే: భక్తులు జగన్నాథునికి సమర్పించిన అర్పణ బియ్యం శుక్రవారం విక్రయించారు. పూరీ జిల్లా నిమపడకు చెందిన ఒక రైస్ మిల్లు యాజమాన్యం 10,322 క్వింటాళ్ల బియ్యం రూ.2,86,96,244 లకు కొనుగోలు చేసినట్లు పాలనాధికారి సిద్ధార్థశంకర్ స్వయిన్ విలేకర్లకు చెప్పారు. వేలం వేసి, ప్రక్రియ సజావుగా చేపట్టామన్నారు. ఈ ఏడాది జనవరి 17న శ్రీజగన్నాథ పరిక్రమణ మార్గం ప్రారంభమైంది. అంతకు ముందు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రచార రథాల ద్వారా బియ్యం, ఇతర పూజా సామగ్రి సేకరించింది. అవి మూలపడేయడంతో భక్తుల్లో అసంతృప్తి వెల్లుబికింది. దీనిపై ప్రచార సాధనాల్లో కథనాలు రావడంతో విక్రయించారు.

జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు రాష్ట్ర లిఫ్టర్లు



ఎంపికైన లిఫ్టర్లు. చిత్రంలో కోచ్, మేనేజర్లు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లోని నగ్రొటా భవన్‌లో ఈ నెల 6 నుంచి 13 వరకు జరగనున్న ఐడబ్ల్యూఎల్ఎఫ్ జాతీయ యువ, జూనియర్, సీనియర్ పురుషుల, మహిళా వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు రాష్ట్ర లిఫ్టర్లు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఒడిశా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి కె.రవికుమార్ శుక్రవారం 'న్యూస్‌టుడే'కు ఆ వివరాలు వెల్లడించారు. జట్టులో మొత్తం అన్ని విభాగాలకు చెందిన 38 మంది క్రీడాకారులు స్థానం పొందారని తెలిపారు. ఎంపికైన లిఫ్టర్లు గంజాం, ఖుర్దా, భువనేశ్వర్, పూరీ, ఢెంకనాల్, గజపతి, బొలంగీర్, మయూర్‌భంజ్, సుందర్‌గఢ్, నవరంగపూర్ శిక్షణ కేంద్రాలకు చెందిన వారని రవికుమార్ పేర్కొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన

రాయగడ గ్రామీణం,న్యూస్‌టుడే; రాయగడ జిల్లా టికిరి పంచాయతీ కేంద్రంలో మంచి నీరు కోసం గ్రామస్థులు రెండు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు మహిళలు రహదారిపై ఖాళీ బిందెలను పెట్టి రాస్తారోకో చేపట్టారు. శుక్రవారం కూడ నిరసన జరిగింది. ఈ ఆందోళనకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం .. టికిరి పంచాయతీ పరిధిలోని హరిజన, కొరాపుట్ వీధులకు ఆరు నెలలుగా మంచి నీరు సరఫరా కావడం లేదు. దీంతో పాటు చేతి పంపులు పాడయ్యాయి. ఈ ప్రాంతవాసులు సర్పంచితో కలిసి సమితి అభివృద్ధి అధికారికి పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో ఆందోళన చేపడతున్నామని గ్రామస్థులు తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ట్యాంకర్లతో మంచి నీరు అందజేస్తామని, రెండు రోజుల్లో చేతి పంపులు బాగు చేస్తామని, వసుధర పథకం ద్వారా కుళాయిలు వేసి నీరు అందిస్తామని సమితి అధికారులు చెప్పారు.



నిరసన తెలుపుతున్న మహిళలు

రాష్ట్ర హాకీ విజేత రవుర్కెల



పతకాలతో క్రీడాకారులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: రవుర్కెలలోని బిర్సా ముండా మైదానంలో జరిగిన మూడో రాష్ట్ర సబ్‌జూనియర్ మహిళా హాకీ పోటీల్లో రవుర్కెల క్రీడల వసతిగృహం క్రీడాకారిణులు విజేతగా నిలిచి ఛాంపియన్ బహుమతిని గెలుచుకున్నారు. గురువారం నిర్వహించిన తుదిపోరులో రవుర్కెలా జట్టు క్రీడాకారిణులు షూటవుట్ ద్వారా 2-1 గోల్స్‌తో సుందర్‌గఢ్ క్రీడాకారిణులపై గెలుపొందారు. మొత్తం పోటీల్లో ఉత్తమ డిఫెండర్‌గా కిరణ్ ఎక్కా, ఉత్తమ క్రీడాకారిణిగా దీపికా బాగె, ఉత్తమ ఫార్వర్డ్‌గా ప్రియాంక మింజ్, ఉత్తమ మిడ్ ఫీల్డర్‌గా సుష్మిత సింగ్, ఉత్తమ గోల్‌కీపర్‌గా ప్రియాంశి మింజ్‌లు ప్రత్యేక బహుమతులందుకున్నారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్‌తిర్కీ విజేతలకు అభినందనలు తెలిపారు. *భువనేశ్వర్‌లో నయాపల్లిలోని ప్రోడీజీ చదరంగం కేంద్రంలో జరిగిన రెండో రాష్ట్ర చదరంగం పోటీలు గురువారం ముగిశాయి. ఇందులో వివిధ జిల్లాలకు చెందిన బాలబాలికలు, యువత, సీనియర్ క్రీడాకారులు నువ్వానేనా అన్నట్లు ఆడి బహుమతులు గెలుచుకున్నారు. ముగింపు కార్యక్రమంలో అతిథులుగా హాజరైన ఒడిశా హాకీ ప్రమోషన్ మండలి సీఈవో దీపాంకర్ మహాపాత్ర్, నిర్వాహక ప్రోడీజీ శిక్షణ అకాడమీ ప్రతినిధులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఎస్పీల బాధ్యతల స్వీకరణ..



ఎస్పీ మిహిర్‌కుమార్ పండా



మాట్లాడుతున్న కొత్త ఎస్పీ రోహిత్‌వర్మ

కొరాపుట్, నవరంగపూర్ న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా కొత్త ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రోహిత్‌శర్మ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ మనందరి బాధ్యతని, పోలీసు సిబ్బందితో అందరు స్నేహపూర్వక వాతావరణం సృష్టించుకోవాలని అన్నారు. ● నవరంగపూర్ కొత్త ఎస్పీగా మిహిర్‌కుమార్ పండా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

విమర్శలు నిరాధారం



మన్మోహన్‌సామల్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: అధికారం కోల్పోయిన బిజద నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని భాజపా రాష్ట్రశాఖ అధ్యక్షుడు మన్మోహన్‌సామల్ అన్నారు. శుక్రవారం భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ రాజ్‌భవన్ రాజకీయాలకు వేదికగా మారిందని బిజద చేస్తున్న విమర్శలు నిరాధారమన్నారు.

మండపాల్లో ప్లాస్టిక్ నిషేధం



సులోచనాదాస్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాజధాని భువనేశ్వర్ పరిధిలో ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో 250 పైచిలుకు మండపాలు ఏర్పాటవుతున్నాయి. ఆయాచోట్ల ప్లాస్టిక్ వినియోగించరాదని నగరపాలక సంస్థ(బీఎంసీ) మేయరు సులోచనాదాస్ కోరారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రతి మండపం వద్ద చెత్త డబ్బాలుంటాయన్నారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

ప్రభుత్వ పథకాలు రైతులకు అందాలి



వ్యవసాయ సదస్సులో పాల్గొన్న అతిథిలు సుదర్శన సబర, శివప్రసాద్ గౌడొ ఇతరులు

గుణుపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు రైతులకు అందేలా చూడాలని గుణుపరం సమితి ఉపాధ్యక్షుడు సుదర్శన సబర అన్నారు. గురువారం సాయంత్రం లక్ష్మి కల్యాణ మండపంలోని వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. పురసంస్థ ఉపాధ్యక్షుడు శివ ప్రసాద్ గౌడొ, వ్యవసాయ అధికారి రాయగడ సీడీఏఓ విష్ణు ప్రసాద్ కొరొ, వ్యవసాయ పరిశోధకులు సచ్చిదానంద పండా, రవీంద్ర కుమార్ పయికొరాయి, ఆ శాఖ అధికారులు బృందావన బెహరా, సంతోష్ కుమార్ రొథొ తదితరులు రైతులకు వ్యవసాయం పరికరాల రాయితీ గురించి వివరించారు.

డిమాండ్లు నెరవేర్చాలని వినతి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: 'ఆల్ ఒడిశా బ్యాంకు రిటైరీ ఫెడరేషన్' ఇచ్చిన పిలుపు మేరకు బ్రహ్మపుర ప్రతినిధులు శుక్రవారం స్థానిక దక్షిణ మండల ఆర్డీసీ కార్యాలయం బయట ప్రదర్శన జరిపారు. అనంతరం ఐదు ప్రధాన డిమాండ్లతో ప్రధాని పేరిట వినతిపత్రాన్ని ఆర్డీసీ కార్యాలయం అధికారులకు అందజేశారు. ఈ ప్రదర్శనలో నళినీకాంత పాణిగ్రహి, గోవిందరావు, అనంతరామ్, ఆర్.ఎన్.ఆచారి తదితరులు పాల్గొన్నారు.



దక్షిణ మండల ఆర్డీసీ కార్యాలయం బయట ప్రదర్శన చేస్తున్న ప్రతినిధులు

6 నుంచి 11 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీలో కార్తిక వ్రతాలు చేయనున్న దీక్షాధారులకు శ్రీక్షేత్ర యంత్రాంగం ఉచిత వసతి, తీర్థ ప్రసాదాలు, రాకపోకలు, వైద్యసౌకర్యాలు కల్పించనున్న సంగతి తెలిసిందే ఈనెల 6 నుంచి 11 వరకు దీక్షాధారులు(హబిషార్థులు)ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చని పూరీ పాలనాధికారి సిద్ధార్థశంకర్ స్వయిన్ శుక్రవారం విలేకర్లకు చెప్పారు. district.gov.comకి దరఖాస్తులు చేయాలన్నారు. దీనికి ఆధార్‌కార్డు, జిరాక్స్ ప్రతులు జతపర్చాలన్నారు. ఈ నెల 14 ఏకాదశి నుంచి శ్రీక్షేత్రంలో జగన్నాథుని కార్తిక వ్రతాలు ప్రారంభం కానున్నాయి. .

విజిలెన్స్ వలలో జూనియర్ ఇంజినీరు.. భువనేశ్వర్, న్యూస్‌టుడే: బొలంగీర్ జిల్లా పాట్నాగఢ్ సమితిలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ ఇంజినీరు హరేకృష్ణసాహు శుక్రవారం విజిలెన్స్ వలకు చిక్కాడు. ఉపాధిహామీ పనులకు సంబంధించి బిల్లుల విడుదలకు ఒక గుత్తేదారు నుంచి రూ. 7 వేలు లంచం పుచ్చుకుంటూ అధికారులకు పట్టుబడ్డారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యుత్తు కోతతో రోగుల అవస్థలు



చరవాణి వెలుగులో వివరాలు నమోదు చేస్తున్న వైద్యురాలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో గురువారం ఎనిమిది గంటల పాటు విద్యుత్తు అంతరాయం కలగడంతో ఆసుపత్రిలో రోగులు అవస్థలు పడ్డారు. దీంతో వైద్య సేవలకు ఆటంకం కలిగింది. చరవాణి వెలుగులో రోగుల వివరాలు, మందుల చీటీ తదితర వాటిని నమోదు చేశారు. సిటీ స్కానింగ్, ఎక్స్-రే, అల్ట్రాసౌండ్ వంటి సేవలు పూర్తిగా నిలిచిపోయి రోగులకు ఇబ్బందులు తప్పలేదు. దీనిపై సమాచారం ఉన్నప్పటికీ వైద్యశాఖ, ఆసుపత్రి వర్గాలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ఈ కష్టాలు తప్పలేదు.

ప్రశాంతంగా పూజలు నిర్వహించాలి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణంలోని వివిధ కూడలిల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల వద్ద పూజలు ప్రశాంతంగా కొనసాగేలా చూడాలని ఎస్‌డీపీఓ మాధవ నందనాయక్ అన్నారు. ఠాణా అధికారి ప్రశాంత్‌భూపతి, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగం ప్రాణాంతకం



అవగాహన ప్రచార పత్రులు ఆవిష్కరిస్తున్న పరుల్, తదితరులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: పొగాకు వినియోగం ప్రాణాంతకమని, దీన్ని అందరూ గుర్తించి దూరంగా ఉండాలని పాలనాధికారి పరుల్ పట్వారీ అన్నారు. బారిజొల్లలోని సీడీఎంఓ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం వేదికపై పొగాకు వినియోగంతో కలిగే నష్టాలు, వాటి నుంచి బయటపడే మార్గానికి అంశాలతో కూడిన ప్రచార అవగాహన పత్రులను ఆవిష్కరించారు. సీడీఎంఓ లాల్‌మోహన్ రౌత్రాయ్, బి.కె.మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: రాష్ట్ర ఆశా కార్మిక సంఘం పిలుపు మేరకు భారతీయ మజ్దూర్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆశా కార్యకర్తలు పాలనాధికారి కార్యాలయానికి చేరుకుని పలు డిమాండ్లతో ప్రధానమంత్రి పేరిట రాసిన వినతిపత్రాన్ని పాలనాధికారి బిజయ్‌కు మార్‌దాస్‌కి అందజేశారు.

భవానీ మాత విగ్రహ ప్రతిష్ఠ



పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గుమ్మ సమితి పద్మాపురంలో భవానిమాత విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం వైభవంగా జరిగింది. రాణిపేట గ్రామానికి చెందిన అంబాల చిరంజీవి, భారతి దంపతులచే పురోహితులు పాలవలస శ్రీధర్‌శర్మ ప్రత్యేక పూజలు చేపట్టారు.

గున్న ఏనుగు మృతి



ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఏనుగు పిల్ల నీట మునిగి మృతి చెందిన ఘటన సువర్ణరేఖ నదిలో మహిపాల్ వద్ద జరిగింది. అటవీశాఖ అధికారులు, స్థానికుల వివరాల ప్రకారం గోపిబల్లబ్‌పూర్ రెండో బ్లాక్ మహిపాల్ వద్ద సువర్ణరేఖా నదిని నుంచి నయాగ్రామ్ వైపుకు ఏనుగులు దాటి వెళుతుండగా ఆ గుంపులో ఒక పిల్ల ఏనుగు ప్రవాహంలో పడి కొట్టుకుపోయింది. దీన్ని గుర్తించిన స్థానికులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న ఏనుగు పిల్లను సిబ్బంది రక్షించినా అప్పటికే మృతి చెందింది.

రక్తదాన శిబిరం

పర్లాఖెముండి, సిమిలిగుడ, న్యూస్‌టుడే: జిల్లా ప్రధానాసుపత్రి ప్రాంగణంలోని రక్తనిధిలో కల్పతరు ప్రాజెక్టు ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 28 యూనిట్ల రక్తం సేకరించారు. ★ సిమిలిగుడ ప్రభుత్వ కళాశాలకు చెందిన యూత్ రెడ్‌క్రాస్, రెడ్ రిబ్బన్ క్లబ్‌లు సంయుక్తంగా దత్తత గ్రామమైన సనబొడింగాలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ రామారంజన్ పట్నాయక్ దీన్ని ప్రారంభించారు. కొరాపుట్ రక్తనిధి అధికారుల పర్యవేక్షణలో 25 మంది రక్తదానం చేశారు. యూత్ రెడ్‌క్రాస్ కౌన్సిలర్ విద్యుత్ ప్రభ రౌత్, కళాశాల పాలకమండలి అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ బెహర, అధ్యాపకులు దేవ్‌రాజ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మద్య నిషేధానికి కృషి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నందపూర్ సమితి బడెల్ పంచాయతీ కిటిబలో మద్య నిషేధానికి కృషి చేస్తామని గ్రామస్థులు ప్రతిజ్ఞ చేశారు. నందపూర్‌కు చెందిన నారాయణ పండా స్మృతి సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు.

తప్పిన ప్రమాదం

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా కొసగుముడా సమితి కొడింగులో పపడహండికి వస్తున్న అంబులెన్స్ ముందు చక్రం విడిపోయి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనా శిరిసి గ్రామం వద్ద జరిగింది. వాహనచోదకుడితో పాటు ఇద్దరు సిబ్బంది ఉన్నారు. అంబులెన్స్ నుంచి దూకి ప్రమాదాన్ని తప్పించుకున్నారు.



ఉపాధ్యాయుడు దాలినాయుడుకి సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న సిబ్బంది

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ ఆంధ్రా ఉన్నత మాధ్యమిక పాఠశాల ఆంగ్లభాష బోధకుడు ఎం.దాలినాయుడు ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు శుక్రవారం దాలినాయుడు దంపతులను సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. స్థానిక తెలుగు ప్రముఖులు రాళ్లపల్లి సుందరరావు, వెంకటేశ్వరరావు, ఎం.మురళీ, వింజమూరు బాలమురళీ, ఆర్.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

కరుణించు శామలేశ్వరి



సంబల్‌పూర్ శామలాయి

శక్తిపీఠాల్లో చండీ ఉపాసన ప్రారంభమైంది. ముత్తయిదువులు నిష్ఠగా నవరాత్రుల వ్రతాలు ప్రారంభించారు. ఆశ్వయుజ శుక్ల పక్షమి ద్వితీయ పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం కటక్ చండీ దేవి జగద్ధాత్రి అవతారంలో, సంబల్‌పూర్ శామలాయి ధవళముఖ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

– న్యూస్‌టుడే, భువనేశ్వర్

భక్తిశ్రద్ధలతో దేవతామూర్తులకు పూజలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో అమ్మవారికి భక్తులు కుంకుమార్చనలు. విశేష పూజలు.. దీపారాధనలు చేశారు. గంజాం జిల్లా వాసుల ఆరాధ్య దైవం మా తరాతరిణి శక్తిపీఠంలో శుక్రవారం దేవతామూర్తుల్ని వివిధ అవతారాలల్లో అలంకరించి పూజలు నిర్వహించారు. ● బ్రహ్మపురలో మార్వాపేటలోని శ్రీ రామలింగ చౌడేశ్వరి అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు.

ఎంపీ ప్రతినిధిగా చంద్రభాను

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా జొరిగావ్ నియోజకవర్గంలో ఎంపీ బలభద్రమాఝి ప్రతినిధిగా చంద్రభాను నాయక్ ఎంపికయ్యారు. పాలనాధికారి, బీడీఓ ప్రీతికుమార్‌లకు సంబంధిత పత్రాలను శుక్రవారం అందజేశారు. వందలాది భాజపా కార్యకర్తలు సొరిసభట్టా చౌక్ నుంచి ర్యాలీ నిర్వహించారు. జొరిగావ్ భాజపా అధ్యక్షుడు గణపతి జైన్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.

నాలుగు జిల్లాల దారిలో నరకయాతన

విజయనగరం, శ్రీకాకుళం, మన్యం, విశాఖ జిల్లాలకు అనుసంధానంగా ఉన్న సంతకవిటి- పొందూరు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి గత నెలలో వచ్చిన వరదలకు కొట్టుకుపోయింది. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ మార్గంలో ప్రయాణం నరకంలా మారింది. సిరిపురం- లైదాం గ్రామాల మధ్య ఉన్న రెల్లిగెడ్డకు సెప్టెంబరులో వచ్చిన వరదలతో కల్వర్టు, రహదారి కోతకు గురై కొట్టుకుపోయాయి. ఈ గెడ్డ సంతకవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలాల సరిహద్దులో ఉంది. రెండు జిల్లాల ఆర్అండ్‌బీ శాఖ అధికారులు తమ పరిధి కాదంటూ వదిలేశారు. తాత్కాలిక మరమ్మతులైనా చేపడితే ప్రయాణం కొంత సులువవుతుందని వాహన చోదకులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై ర.భ.శాఖ ఏఈ ఆంజనేయనాయకర్‌ను వివరణ కోరగా.. రెల్లిగెడ్డపై ఉన్న వంతెన సంతకవిటి మండల పరిధిలో ఉన్నా.. మండలాధికారులు మాత్రం పొందూరు పరిధిగా చెబుతున్నారన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. అధికారుల సూచన మేరకు శాశ్వత మరమ్మతు పనులకు రూ.25 లక్షలు అవసరమని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. తాత్కాలిక మరమ్మతులకు రూ.2 లక్షలు మంజూరు చేయాలని కలెక్టరును కోరామన్నారు. – న్యూస్‌టుడే, సంతకవిటి


వరదనీటి ప్రవాహానికి దెబ్బతిన్న కల్వర్టు


రెల్లిగెడ్డ ఉద్ధృత ప్రవాహానికి కొట్టుకుపోయిన ప్రధాన రహదారి

ఒడిశా అభివృద్ధే బిజద లక్ష్యం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఒడిశా అభివృద్ధే బిజద లక్ష్యమని, ప్రజల వెంటే ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని బిజద సమన్వయ కమిటీ ఛైర్మన్, మాజీ మంత్రి దేబీ ప్రసాద్ మిశ్ర అన్నారు. బ్రహ్మపుర పురపాలక సంస్థ (బీఈఎంసీ) పరిధిలో శుక్రవారం సాయంత్రం బిజద జనసంపర్క పాదయాత్ర జరిగింది. స్థానిక గాంధీనగర్ కూడలిలో ప్రారంభమైన ఇందులో పాల్గొన్న మిశ్ర విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీగా బిజద రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలపై ఉద్యమిస్తోందని చెప్పారు.


పాదయాత్రలో పాల్గొన్న దేబీ ప్రసాద్ మిశ్రా. చిత్రంలో చంద్రశేఖర సాహు, చ్యవుపట్నాయక్, బిక్రం పండా, భృగు బక్షిపాత్రో, సంఘమిత్ర దొళాయి తదితరులు

ప్రమాదంలో యువకుడి దుర్మరణం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కళ్లికోట ఠాణా పరిధిలోని నువాపాసుల కూడలి వద్ద గురువారం రాత్రి కాంక్రీటు మిక్సర్ యంత్రాన్ని ఢీకొని తోటగావ్‌కు చెందిన బుల్లెట్ చోదకుడు టునా బారిక్ మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కళ్లికోట ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స అనంతరం బ్రహ్మపురలోని ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కళ్లికోట-తోటగావ్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. మృతుడి భార్య గర్భవతి అని కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. శుక్రవారం ఉదయం నిరసన చేపట్టారు. కళ్లికోట తహసీల్దారు ఆర్యకుమార్ సర్బదమన్, ఛత్రపురం ఎస్డీపీఓ గౌరహరి సాహు, కళ్లికోట ఠాణా ఐఐసీ నరేష్ కుమార్ సాహు సంఘటనా స్థలానికి వచ్చి వారికి నచ్చజెప్పడంతో శాంతించారు. నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించారు.

'మర్యాదపూర్వకంగానే కలిశాం'

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఒడిశా రాజ్‌భవన్‌లో గవర్నర్ రఘుబర్ దాస్, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, అసోం సీఎం హిమంత బిశ్వశర్మ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొన్ని రోజుల క్రితం సమావేశమయ్యారు. దీనిపై విపక్షాలు మండి పడుతున్నాయి. అందరికీ అందుబాటులో ఉండాల్సిన రాజ్ భవన్ రాజకీయాలకు వేదికగా మారిందని దుయ్యబడుతున్నారు. బిజద నాయకులు విమర్శలు గుప్పిస్తుండటంతో వెంకయ్యనాయుడు శుక్రవారం 'ఎక్స్' వేదికగా వివరణ ఇచ్చారు. తమది మర్యాదపూర్వక కలయికే తప్ప రాజకీయాలు గురించి ఏమి మాట్లాడలేదని స్పష్టం చేశారు.

మన్యంలో వైద్యానికి పెద్దపీట

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వైద్యానికి ముఖ్యంత్రి చంద్రబాబు ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. రాష్ట్రంలో 40 ఆరోగ్య కేంద్రాలకు నూతన భవనాలు మంజూరైతే మన్యం జిల్లాకే 8 వచ్చాయని, సాలూరు మండలంలో 4 ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం సాలూరు మండలంలోని పెదపదం పంచాయతీ కేంద్రంలో రూ.55 లక్షలతో నిర్మించనున్న ఆరోగ్య కేంద్ర భవనానికి శంకుస్థాపన చేశారు. బాగువలస పీహెచ్‌సీలో జరిగిన అవకతవకలు వెలికి తీస్తామని చెప్పారు. అనంతరం ఉన్నతి పథకం కింద మహిళా సంఘానికి మంజూరైన రూ.15 లక్షల చెక్కును సభ్యులకు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, తెదేపా పట్టణ, మండలాధ్యక్షులు చిట్టి, పరమేశు, వేణు, ఎంపీటీసీ సభ్యులు ఎ.రమాదేవి, శ్యామ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక అందించాలి

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానం అమలు చేసి కార్మికులకు ఆర్థిక ఆసరా కల్పించాలని సీపీఎం, సిటు నాయకులు ఆర్.వేణు, వై.మన్మథరావు డిమాండు చేశారు. ఉచిత ఇసుక పాలసీపై పట్టణంలో నిరసన తెలిపారు. పాతబస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లారు. గత ప్రభుత్వంలో ఇసుక లేక కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. ఇన్‌ఛార్జి డీఆర్వో కేశవనాయుడుకు వినతి పత్రం అందించారు. నాయకులు బి.దాసు, జి.వెంకటరమణ, కె.సాంబమూర్తి, దిలీప్ తదితరలు పాల్గొన్నారు.

గిరిజనులకు గజరాజుల బెంగ

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం మండలంలోకి ప్రవేశించిన ఏనుగులు గిరిజన గూడల్లోకి వచ్చి పంటలు, తోటలను ధ్వంసం చేస్తున్నాయి. శుక్రవారం సీతంపేట మార్గంలో ఆరు ఎకరాలకు పైగా పంటలను తొక్కేశాయి. తర్వాత సమీపంలోని పామాయిల్ తోటలో తిష్ఠవేశాయి. తొలిసారి ఈ గ్రామాల వైపు ఏనుగులు రావడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కోరి, పనసభద్ర, తొక్కుడవలస, తాన్నవలస, సీతంపేట, రంగలగూడ మధ్య సంచరిస్తుండటంతో గ్రామస్థులు కాపుకాస్తున్నారు. రేంజర్ మణికంఠేష్ నేతృత్వంలో ట్రాకర్లు పర్యవేక్షిస్తున్నారు.


సీతంపేట మార్గంలో ధ్వంసమైన వరిచేను

సాలూరుకు రైలొచ్చింది


రైలును ఆసక్తి చూస్తున్న పట్టణ ప్రజలు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఏళ్లుగా ఎదురుచూస్తున్న సాలూరు పట్టణ ప్రజల ఆశలు ఎట్టకేలకు నెరవేరాయి. శుక్రవారం విశాఖ నుంచి నిర్వహించిన ట్రైల్ రైన్ విజయవంతమైంది. విశాఖ నుంచి బొబ్బిలి మీదుగా సాలూరు స్టేషన్‌కు చేరుకుంది. రైలు రాక విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, పట్టణానికి చెందిన పలువురు స్టేషన్‌కు చేరుకొని స్వాగతం పలికారు.

15 రోజుల్లో పూర్తిస్థాయి సేవలు..: బ్రిటీష్ కాలం నుంచి సాలూరులో రైల్వే స్టేషన్ ఉండేది. తొలుత బొగ్గు ఇంజిన్‌తో రైలు ఎక్కువ కాలం నడిచింది. 2018లో ఇక్కడ స్టేషన్‌లో విద్యుత్ లైను నిర్మించారు. 1998 నుంచి 2020 వరకు డీజిల్ ఇంజన్‌తోనే బొబ్బిలి వరకు రెండు బోగీలతో రైలు బస్సు నడిచింది. 2020లో కరోనా నుంచి స్టేషన్‌కు రైలు రాకపోకలు నిలిపేశారు. తర్వాత సాలూరు నుంచి విశాఖకు రైలు వేయాలని పలు సంఘాల ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు కోరుతూ వచ్చారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చొరవ, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సహకారంతో ఎట్టకేలకు కలనెరవేరింది. మరో 15 రోజుల్లో విశాఖ నుంచి సాలూరుకు పూర్తిస్థాయిలో రైలు నడపనున్నట్లు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.

గత నిర్లక్ష్యం.. నిత్యం నరకం

రామభద్రపురం, బాడంగి, న్యూస్‌టుడే

ఐదేళ్ల క్రితం చేపట్టిన రహదారుల నిర్మాణాలు సగంలో ఆగిపోవడంతో ప్రయాణికులు నిత్యం నరకం చూస్తున్నారు. గత ప్రభుత్వం రూ.కోట్లలో బిల్లులు గుత్తేదారులకు ఇవ్వకపోవడంతో వారు వదిలేశారు. బొబ్బిలి నియోజకవర్గంలో నిధుల కొరతతో పనులు చేయలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారుల పథకం కింద ఏషియన్ బ్యాంకు నిధులతో 2019లో 21 రహదారుల నిర్మాణానికి రూ.58 కోట్లు మంజూరు అయ్యాయి. బొబ్బిలి మండలంలో 10 రోడ్లు, రామభద్రపురం, బాడంగి మండలాల్లో మూడు చొప్పున, తెర్లాంలో 5 రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వీటిలో కేవలం రెండు మాత్రమే పూర్తయ్యాయి. మిగతా 19 రోడ్లు వివిధ దశల్లో ఆగిపోవడంతో సమస్య ఏర్పడింది.

ఎక్కడెక్కడంటే..?

రామభద్రపురం మండలంలోని కోటశిర్లాం నుంచి ఆర్.చింతలవలస, రామభద్రపురం నుంచి వంగపండువలస, జగన్నాథపురం దారుల్లో కంకర, మెటల్ వేసి చదును చేశారు. ఆపై బిల్లులు రాలేదని వదిలేశారు. ప్రస్తుతం రాళ్లు తేలిపోయి, గోతులు ఏర్పడ్డ మార్గంలో రాకపోకలు చేయడానికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. బాడంగి మండలంలోని గజరాయనివలస, ఏజీపేట, పి.వెంకంపేట, బొబ్బిలి మండలం డొంగిరివలస, కుమ్మందవానివలస, అన్నంనాయుడుపేట, కొల్లివలస, కింతవానిపేట, ఎం.పనుకువలస, రెడ్డివలస, బంకురువలస, చల్లారపువలస, ఎన్.జనార్దనవలస రహదారుల దుస్థితి ఇంతే. తెర్లాం మండలంలో అరసబలగ, సోమిదివలస మార్గాలు పూర్తికాగా, జన్నివలస, మొదుగువలస రహదారులు నిలిచిపోయాయి.


వంగపండువలస మార్గం దుస్థితి

డిసెంబరులోగా పూర్తికి చర్యలు

ఈ ఏడాది డిసెంబరు నెలలోగా సగంలో ఆగిన రహదారుల నిర్మాణాలు పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటాం. ఇంతవరకూ గుత్తేదారులకు రూ.14 కోట్ల బిల్లులు చెల్లించాం. చేసిన పనుల మేరకు ఇంకా రూ.4 కోట్లు బకాయి ఉంది. నిధుల కొరతతో సమస్య వచ్చింది. త్వరలో నిధులు రానున్నాయి. పనులు చేయాలని గుత్తేదారులకు సూచించాం.
– నాయుడు, పంచాయతీ రాజ్ ప్రాజెక్టు ఏఈ, బొబ్బిలి


రాళ్లు తేలిన ఆర్.చింతలవలస రహదారి

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు


బెలగాం, జియ్యమ్మవలస న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో ముద్దాయికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేలు జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంటు సెషన్ జడ్జి ఎస్.అరుణ తీర్పు వెలువరించారు. ఎస్సై పి.అనీష్ వివరాల మేరకు.. 2019లో వ్యక్తిగత కక్షలతో పెదమేరంగి కూడలి వద్ద పి.ధర్మారావుపై అదే గ్రామానికి చెందిన బి.లోకనాథం దాడి చేసి గాయపరిచారు. కేసు నమోదు చేసి చినమేరంగి పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం గురువారం లోకనాథంకు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్లు ఎస్సై చెప్పారు.

గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా నోడల్ అధికారి ఎం.వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గవరమ్మపేట, చినమేరంగిలో ఇంటింటికీ వెళ్లి గర్భిణుల ఆరోగ్య పరిస్థితి పరిశీలించారు.

విద్యార్థులకు అపార్ కార్డు

కొత్తవలస, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థికీ జాతీయ స్థాయిలో 'వన్ నేషన్ - వన్ ఐడీ' పేరుతో 17 అంకెలుండే గుర్తింపు కార్డు ఇవ్వడానికి కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. 'ఆధార్' తరహాలోనే 'అపార్' (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) పేరుతో దీనికి రూపకల్పన చేశారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లోని కేజీ నుంచి పీజీ వారికి జిల్లాలో ఈ కార్డు అందుబాటులోకి రానుంది. ముందుగా 9, 10 తరగతుల వారికి వీటిని జారీ చేయాలని నిర్ణయించారు. ఈమేరకు తల్లిదండ్రుల నుంచి అనుమతి పత్రం తీసుకోవాలని విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశించడంతో జిల్లాలో ప్రక్రియను ప్రారంభించారు. దసరా సెలవుల ముందురోజు తల్లిదండ్రులకు అనుమతి పత్రం ఇచ్చి, దీనిపై కలిగే ఉపయోగాలను తెలియజేశారు. సెలవుల అనంతరం 14వ తేదీన ఈ పత్రాలను పాఠశాలల్లో అందజేయాలని స్పష్టం చేశారు.


అధికారులు ఇచ్చిన అనుమతి పత్రం

ప్రయోజనాలివీ..

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 17 అంకెలతో కూడిన గుర్తింపు నంబరు డిజిటల్ కార్డులో ఉంటాయి. ఈ ప్రత్యేక సంఖ్యను నమోదు చేస్తే విద్యార్థి కుటుంబ వివరాలు, మార్కుల ధ్రువపత్రాలు తదితర వివరాలన్నీ తెలుసుకోవచ్చు. ప్రవేశ పరీక్షల దరఖాస్తులోనూ ఈ సంఖ్యను నమోదుచేస్తే సరిపోతుంది. అకడమిక్ పరంగా జీవితకాల గుర్తింపు కార్డుగా దీన్ని పరిగణిస్తారు. ఎల్‌కేజీలో చేరినప్పటి నుంచి విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు అన్ని వివరాలు ఇందులో ఉండనున్నాయి. దీనిని ఆధార్ సంఖ్యతో పాటు అకాడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్(ఏబీసీ) అనే ఎన్యూమరేటర్ అనుసంధానిస్తారు. విద్యార్థి బ్యాంకు ఖాతా (అకడమిక్), డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. గుర్తింపు కార్డులకు అడిగిన సమాచారం ఇవ్వాలని తల్లిదండ్రుల సమ్మతిని కోరుతూ సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పత్రాలను పంపారని కొత్తవలస ఎంఈవో బి.శ్రీనివాసరావు చెప్పారు. డీఈవో ప్రేమకుమార్ ఆదేశాల ప్రకారం ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు.

అభివృద్ధికి అంచనాలు – రైతుల్లో ఆశలు

రూ.20 కోట్లతో సాగునీటి వనరుల మరమ్మతులు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: కర్షకుల సాగునీటి కష్టాలు తీర్చాలన్న ఉద్దేశంతో నిర్మించిన వనరులు గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యానికి నీరుగారి పోయాయి. కొత్త నిర్మాణాల సంగతి పక్కన పెడితే ఉన్నవాటి ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయకుండా వదిలేశారు. దీంతో మన్యంలోని చిన్న నీటి వనరులే ఆధారంగా పంటలు పండించిన రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చెక్‌డ్యామ్‌లు, జలాశయాలను బాగు చేసేలా అడుగులు వేస్తోంది.


కె.శివడ సమీపంలో పూడికతో నిండిన చెక్‌డ్యామ్

శిథిలావస్థలో చెక్‌డ్యామ్‌లు..

కురుపాం నియోజకవర్గంలో ఐటీడీఏ, నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో సుమారు 300 వరకు చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. వీటి ద్వారా 20 వేల ఎకరాలకు సాగు నీరు అందించాల్సి ఉంది. కానీ గత అయిదేళ్లలో చాలా చోట్ల నిర్మాణాలు శిథిలావస్థకు చేరాయి. సుమారు 160 వరకు చిన్న, పెద్ద పంట కాలువలున్నాయి. వీటి ద్వారా 18 వేల ఎకరాలకు నీరు వెళ్లాలి. పూడికలు, తుప్పలు పెరగడంతో వాటి ఆనవాళ్లే కనుమరుగయ్యాయి. వీటి బాగుకు 2022లో సుమారు రూ.6 కోట్లతో ప్రతిపాదనలు పంపించినా నిధులు మాత్రం రాలేదు.


అసంపూర్తిగా ఉన్న రేగిడి గెడ్డ అనుసంధాన పనులు

డిసెంబరులో పనులకు అవకాశం..

వృథా జలాలు ఒడిసి పట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కురుపాం డివిజన్ పరిధిలో మరమ్మతులకు గురైన చెక్‌డ్యామ్‌లు, జలాశయాలు, కాలువలు, చెరువులను గుర్తించారు. వీటి అభివృద్ధికి సుమారు రూ.20 నుంచి రూ.30 కోట్లతో అంచనాలు తయారు చేస్తున్నారు. గుమ్మిడిగెడ్డ కాలువల ఆధునికీకరణ, రేగిడి నుంచి ఒట్టిగెడ్డ అనుసంధానం, గుజ్జువాయి మినీ జలాశయం పనులు చేపట్టనున్నారు. ఒట్టిగెడ్డ ఆధునీకరణకు రూ.47 కోట్లు మంజూరైనా కేవలం రూ.3 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. మిగిలిన నిధులతో డిసెంబరు నుంచి పనులు ప్రారంభించనున్నారు.

ప్రతిపాదనలు చేపడుతున్నాం..

శిథిలమైన చెక్‌డ్యామ్‌లు, ఇతర సాగునీటి వనరులను గుర్తించాం. గుమ్మిడిగెడ్డ కాలువల నిర్వహణ, రేగిడి గెడ్డ పనుల పూర్తికి అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం. – రవికుమార్, జలవనరులశాఖ డీఈఈ

మహానదిలో ఇద్దరు బాలురు గల్లంతు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్‌లోని జగత్‌పూర్ బలిసాహికి చెందిన ఇద్దరు 8వతరగతి విద్యార్థులు మహానదిలో స్నానాలు చేస్తూ శుక్రవారం సాయంత్రం ప్రవాహంలో కొట్టుకుపోయారు. జగత్‌పూర్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలించినా ఆచూకీ లభించలేదు.

పాలన చేరువ చేసేందుకు కృషి

సీతానగరం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పాలన మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే విజయచంద్ర పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెదంకలాంలో సచివాలయం, రైతు సేవా కేంద్రం భవనాలను ప్రారంభించారు. సర్పంచి బి.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డీఈ రత్న కుమార్, నాయకులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రహదారుల పరిశీలన

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మండలంలో మంజూరైన ఆరు బీటీ రహదారులను పంచాయతీరాజ్ ఎస్ఈ ఎం.శ్రీనివాస్ పరిశీలించారు. ద్రాక్షిణి గ్రామానికి రూ.1.40 కోట్లు, కుదమ నుంచి గదబవలసకు రూ.1.20 కోట్లు, లోతువానివలసకు రూ.80 లక్షలు, డంగబద్రవలసకు రూ.1.30 కోట్లు, వెంకటరాజుపురానికి రూ.19 లక్షలు, బాసంగి గదబవలసకు రూ.26 లక్షలు నిధులు మంజూరైనట్లు చెప్పారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. డీఈఈ జి.శ్రీనివాసరావు, ఏఈ పార్థసాయి, సచివాలయ ఇంజినీరింగు సహాయకులు పాల్గొన్నారు.

53 మందికి ఉపాధి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించారు. 4 కంపెనీల్లో ఉద్యోగాలకు 53 మంది ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు. మొత్తం 273 మంది హాజరైనట్లు చెప్పారు. ఎంపికైన వారు పార్వతీపురం, విశాఖపట్నం, హైదరాబాద్‌లో పని చేయాల్సి ఉంటుందన్నారు.


మేళాకు హాజరైన యువత

కూలే వరకు పట్టించుకోరా..?

● శిథిలావస్థకు చేరిన కల్వర్టులు ● మరమ్మతులు చేపట్టకపోతే ముప్పే

గ్రామీణ ప్రాంతాల్లో ఏళ్ల కిందట నిర్మించిన కల్వర్టులు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. నిర్వహణ పట్టించుకోకపోవడంతో చాలావరకు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. కొన్నిచోట్ల పెచ్చులు ఊడి.. తుప్పు పట్టిన చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. ఆయా మార్గాల్లో ప్రయాణిస్తున్న వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలకు గురవుతున్నారు. ఇటీవల కంచిలి మండలం నారాయణబట్టి వద్ద ఆర్అండ్‌బీ శాఖ పర్యవేక్షణలో ఉన్న కల్వర్టు కూలిపోయింది. 15 పంచాయతీల పరిధిలో గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్ చొరవతో ఉన్నతాధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో ప్రస్తుతానికి సమస్య పరిష్కారమైంది. ప్రమాదకరంగా ఉన్న కల్వర్టుల పరిస్థితిపై 'ఈనాడు' పరిశీలన కథనం.

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే, కంచిలి, సరుబుజ్జిలి, బూర్జ, నరసన్నపేట గ్రామీణం

ఈనాడు న్యూస్‌టుడే పరిశీలన

తెదేపా హయాంలో వంతెనలు, కల్వర్టుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. వైకాపా ప్రభుత్వం ఆయా పనులను గాలికొదిలేసింది. గత ఐదేళ్లలో అధికారులు ప్రమాదకరంగా ఉన్న వాటికి సంబంధించి ప్రతిపాదనలు పంపినా పట్టించుకున్న దాఖలాలు లేవు.



నిర్వహణ అధ్వానం

సరుబుజ్జిలి మండలం అలికాం-బత్తిలి రోడ్డులో నక్కలపేట, షలంత్రి, సవలాపురం, బప్పడం గ్రామాల కూడళ్ల వద్ద కల్వర్టులు పనికి రాని మొక్కలతో నిండిపోయాయి. చాలా వరకు పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకున్నాయి.

తాత్కాలిక పనులతో సరి..



కంచిలి మండలం డోలగోవిందపురం-పోలేరు మార్గంలో ఓ కల్వర్టు కూలేందుకు సిద్ధంగా ఉంది. పోలేరు గ్రామం వద్ద గోవిందసాగరం నీరు పారే కాలువపై కల్వర్టు ఇప్పటికే కూలడంతో దానిపై మట్టి పేరుకుపోయింది. దీని మీదుగా వరద నీరు పారుతుంటుంది. జలంత్రకోట-శాసనాం మార్గంలో రెండు కల్వర్టులు దెబ్బతినడంతో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి వదిలేశారు.

రక్షణ గోడలు శిథిలం



బూర్జ మండలం నారాయణపురం వద్ద నారాయణపురం ఆనకట్ట ఎడమ ప్రధాన కాలువపై దశాబ్దాల కిందట నిర్మించిన వంతెన రక్షణ గోడలు శిథిలమయ్యాయి. దానిపై గుంతలు ఏర్పడటంతో ఎప్పుడు కూలుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇది కూలితే కొల్లివలస, చీడివలస, లంకాం, కాలపర్తి, సుమారు 50 గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.

ప్రతిపాదనలు పంపాం..

జిల్లాలో ప్రమాదకరంగా ఉన్న వంతెనలు, కల్వర్టుల పరిస్థితిని ఎప్పటికప్పుడు గుర్తించి ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. శిథిలావస్థకు చేరిన కట్టడాల మరమ్మతులకు అంచనాలు రూపొందించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. – సుధాకర్, ఎస్ఈ, ఆర్అండ్‌బీ శాఖ

బయటపడిన ఇనుప చువ్వలు



నరసన్నపేట మండలం బాదాం వద్ద జలుమూరు కాలువపై నాలుగు దశాబ్దాల కిందట నిర్మించిన కల్వర్టు కుంగిపోయింది. శ్లాబు పెచ్చులూడటంతో ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. ఇది కూలితే బాదాం, తోటాడ, జగన్నాథపురం, కామకుర్తివానిపేట గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయి.

ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో కల్వర్టులు	4,280	శ్రీకాకుళం డివిజన్	2,125	వర్షాలకు దెబ్బతిన్నవి	18	టెక్కలి డివిజన్	2,155	శిథిలావస్థకు చేరినవి	162